

కేక్ కట్ చేస్తున్న మాజీ ప్రధాని దేవెగౌడ

కులగణన నివేదికపై.. తొందరొద్దు..!

- ప్రజల్లో నమ్మకం పెంచాలి
- జాగ్రత్తగా లేకుంటే రాజకీయంగా నష్టమే
- సర్కారుకు ప్రైవేట్ సంస్థ నివేదిక

బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): కులగణన నివేదిక విషయంలో ఆత్రుత పడవద్దని, ఏమాత్రం అడుగులు ముందుకేస్తే రాజకీయంగా కాంగ్రెస్ పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఓ ప్రైవేట్‌సంస్థ ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించింది.

● కులగణన విషయంలో ఆదినుంచి ఇప్పటిదాకా వ్యతిరేకత కొనసాగుతూనే ఉంది. సిద్దరామయ్య 2013 నుంచి 2018వరకు ముఖ్యమంత్రిగా కొనసాగినవేళ బీసీ కులాల ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన గణాంకాల కోసం సర్వేకు నిర్ణయించారు. 2018 నాటికి దాదాపు నివేదిక పూర్తయ్యింది. అయితే అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి చవిచూసింది. కానీ జేడీఎస్‌తో కలసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రభుత్వానికి సిద్దరామయ్య సమన్వయ కర్తగా వ్యవహరించిన ఏడాదిన్నరపాటు సాగిన సంకీర్ణపాలనలో కులగణన నివేదిక స్వీకరించే విషయమై ఎక్కడా చర్చలు సాగలేదు. ఆ తర్వాత మూడున్నరేళ్లపాటు బీజేపీలో ముఖ్యమంత్రులుగా యడియూరప్ప, బసవరాజ్ బొమ్మై కొనసాగారు. వారు ఈ నివేదిక అంశాన్ని స్వీకరించేందుకు సుముఖత చూపలేదు. అయితే 2023లో మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన అంశం తెరపైకి వచ్చింది. 2024లో బీసీ కమిషన్ చైర్మన్ జయప్రకాశ్‌హెగ్డే ప్రభుత్వానికి కులగణన నివేదికను సమర్పించారు. అయితే ఆచితూచి ప్రభుత్వం స్వీకరించేందుకు మీనమేషాలు వేసింది. ఇటీవల కేబినెట్‌లో కులగణన నివేదికను స్వీకరించింది. ఇలా నివేదికను స్వీకరించి వందరోజులు పూర్తి అయ్యింది.



కులగణన నివేదికతో సీఎం సిద్దరామయ్య (ఫైల్)



● కులగణన నివేదిక ఇప్పటికీ ప్రభుత్వం అధికారికంగా బహిర్గతం చేయలేదు. కానీ అంతా బహిరంగ రహస్యమే అనేలా కులాలవారీగా గణాంకాలు తేలిపోయాయి. కేబినెట్‌లో స్వీకరించిన తర్వాత మంత్రులకు కాపీలను ఇచ్చి అధ్యయనం చేయాలని సూచించారు. తొలుత వారం రోజుల అధ్యయనానికి నివేదికలు ఇచ్చినప్పుడే కులాలవారీగా జనాభా వివరాలు తేలిపోయాయి. కులగణనను ప్రభుత్వం స్వీకరించినప్పుడే ప్రతిపక్షాలు బీజేపీ, జేడీఎస్‌లు తీవ్రంగా వ్యతిరేకించాయి. అయితే అధికార కాంగ్రెస్‌లోని ఎమ్మెల్యేలు ఎట్టి పరిస్థితుల్లోనూ నివేదికను అంగీకరించేది లేదన్నారు. అంతలోనే మంత్రులు మధ్య బేధాభిప్రాయాలు వచ్చాయి. రాష్ట్రంలో దశాబ్దాలకాలంగా అత్యధిక జనాభా కల్గిన కులాలుగా ఒక్కలిగ, లింగాయత ఉన్నారు. కానీ భారీగా వ్యత్యాసం చూపారనేది రెండు కులాలకు చెందిన ముఖ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రెండు కులాలకు మఠాలు, స్వామీజీల ప్రాబల్యం అధికంగా ఉంది. స్వామీజీలు నివేదికను తప్పుబట్టారు. ఒక్కలిగ సంఘం, వీరశైవ మహాసభ, లింగాయత మహాసభలు అత్యవసరంగా భేటీ అయి నివేదికను వ్యతిరేకించాయి. ఈలోగానే కులగణన నివేదికపై ప్రత్యేక కేబినెట్‌లో వీరశైవ లింగాయత, ఒక్కలిగ సమాజానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలిపారు. కనీసం నాలుగైదు గంటలపాటు చర్చలు జరుగుతాయని భావించినా కేవలం అరగంటలోనే సభను ముగించే పరిస్థితి ఏర్పడింది. ఆ తర్వాత ఈనెల 22న కులగణనపై మరోసారి కేబినెట్ భేటీ జరగనుంది.

● ఢిల్లీకి కులగణన నివేదికతోపాటు మంత్రుల అభ్యంతరాలు, ఎమ్మెల్యేల వ్యతిరేకత, వివిధ స్వామీజీలు, కులసంఘాలు లేవనెత్తిన అంశాలపై సమగ్ర సమాచారం చేరింది. ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో ప్రజాభిప్రాయసేకరణ అవసరమని కాంగ్రెస్ భావించింది. 2023 శాసనసభ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకోసం పనిచేసిన ఏజెన్సీ ద్వారా కులగణనపై రాష్ట్రస్థాయిలో సమగ్ర వివరాలు సేకరించాలని సూచించింది. ఇలా దాదాపు 3 వారాలపాటు ఏజెన్సీ నిర్వాహకులు రాష్ట్రంలోని భిన్నమైనవారితోపాటు వివిధ రంగాల ప్రముఖులు, కులసంఘాలతో కులగణన ప్రస్తావన లేకుండానే ఆరా తీసినట్టు తెలుస్తోంది.

నివేదికలోని కీలక అంశాలు

కాంగ్రెస్ పార్టీ ఆదేశాలతో ఏజెన్సీ పలు అంశాలను నివేదిక రూపంలో సమర్పించినట్టు సమాచారం. ఇందులో ప్రధానంగా కులగణన నివేదిక వివరాలను ప్రభుత్వం అధికారికంగా కాకుండా అంతా రహస్యం అనేలా బహిరంగం చేయడం. ప్రజల్లో నమ్మకం లేనట్టయ్యిందని పేర్కొంది. ప్రజల్లో విశ్వాసం కల్పించకపోవడంతో అనుమానాలు సవాళ్లుగా మారుతున్నాయి. కులగణన నివేదిక విషయంలో ముందుకెళ్తే వివిధ కులాలనుంచి వ్యతిరేకత తీవ్రమవుతుందని సూచించినట్టు తెలుస్తోంది. పార్టీకి ఇది ఏ స్థాయిలోనైనా దెబ్బతీయవచ్చునని వివరించినట్టు సమాచారం. దీనికితోడు మంత్రుల భిన్నాభిప్రాయాలు ప్రజల్లోకి వెళ్లిపోవడంతో ప్రభుత్వంలో ఒకే విధానంతో లేరనేది స్పష్టమైంది. మరోవైపు వీరశైవలింగాయత సమాజానికి చెందిన మంత్రులు, ముఖ్యమంత్రికి ప్రత్యేకమైన వినతిని ఇచ్చారు. కులగణన విషయంలో రాజకీయంగా పార్టీకి నష్టం జరగనుందని వినతిలో పేర్కొన్నారు. ఇదే తరహాలోనే ఏజెన్సీ నివేదిక కూడా ఉండడంతో ప్రభుత్వం డోలాయమానంలో పడింది.

● ఒకవేళ కులగణన విషయంలో ముందుకెళ్తే రాజకీయంగా నష్టం జరిగితే ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ పడినట్టు అవుతుంది. ప్రతిపక్ష బీజేపీ-జేడీఎస్‌లు శాసనసభలో సంఖ్యాబలంగా అధికార పార్టీకి దీటుగా లేకపోయినా ఎదురొడ్డి పోరాడేంత బలం ఉంది. మరో నాలుగైదు నెలల్లో గ్రేటర్ బెంగళూరు అథారిటీకి ఎన్నికలు జరుపుతామని డీసీఎం బహిరంగ ప్రకటన చేశారు. జిల్లా, తాలూకా, నగర పాలికెలు, గ్రామపంచాయతీల ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇలా కులగణన విషయంలో ముందుకు వెళ్తే అన్ని విధాలా దెబ్బపడనుందని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. 22న జరిగే చర్చ ఏ విధంగా ఉంటుందని సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.

93వ వసంతంలోకి మాజీ ప్రధాని దేవెగౌడ

● 'ఎక్స్'లో ప్రధాని మోదీ శుభాకాంక్షలు

బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవెగౌడ 93వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఆదివారం దేవెగౌడ జన్మదిన వేడుకలను నిరాడంబరంగా జరుపుకొన్నారు. బెంగళూరు పద్మనాభనగర్ నివాసంలో పార్టీ ముఖ్యులు దేవెగౌడ చేత కేక్ కట్ చేయించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'ఎక్స్' ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. దేవెగౌడకు జన్మదిన శుభాకాంక్షలని, ప్రజాసేవలో అంతటా గౌరవం అనిపించుకున్నారని పలు విషయాల్లో ఆయన మేధస్సు, అంతర్గతమైన ఆలోచనలు శక్తివంతమైనవని అభిప్రాయపడ్డారు. సుదీర్ఘకాలం ఆరోగ్యకరమైన జీవనం సాగించాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. సీఎం సిద్దరామయ్య, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, మాజీ సీఎం యడియూరప్ప, ఎంపీ తేజస్విసూర్య, మాజీ ఎంపీ ప్రతాప్‌సింహ తదితరులు ఎక్స్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రమంత్రి కుమారస్వామి 'ఎక్స్' ద్వారా నా తండ్రి, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవెగౌడ మట్టిలో మాణిక్యమని, భక్తిపూర్వకమైన జన్మదిన శుభాకాంక్షలన్నారు. నా శక్తి, ధైర్యం, స్ఫూర్తి నా తండ్రి అంటూ రాసుకున్నారు. ప్రతిపక్షనేత అశోక్ స్వయంగా దేవెగౌడ ఇంటికి వెళ్లి ప్రత్యేకంగా సత్కరించారు. రాష్ట్రానికి చెందిన పలువురు రాజకీయ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. మధ్యాహ్నం దేవెగౌడ కుటుంబం తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనంకోసం బయల్దేరారు.

జనజీవన స్రవంతిలోకి 27 గిరిజన కుటుంబాలు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మంత్రులు ఈశ్వర్‌ఖండ్రె, సతీశ్‌జార్కిహొళి

బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): అటవీప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న గిరిజనుల అభ్యున్నతికి కట్టుబడ్డామని, 27 కుటుంబాలను జన జీవన స్రవంతికి తీసుకురావాలని నిర్ణయించినట్టు అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రె తెలిపారు. శనివారం లబ్ధిదారులకు చెక్కులు అందచేశారు. మంత్రి మాట్లాడుతూ బెళగావి జిల్లా ఖానాపుర తాలూకా హెమ్మడగ, భీమాగడ అటవీప్రాంతంలో తలేవాడ గ్రామాల పరిధిలోని 27 గిరిజన కుటుంబాలను అటవీప్రాంతంనుంచి వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురాదలిచామన్నారు. అవసరమైన ఆర్థికసాయం, ఇతరత్రా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. భీమాగడ అటవీప్రాంతంలో 13 గిరిజన గ్రామాలలో 754 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. వీరిలో 27 కుటుంబాలు అటవీప్రాంతాలను వదిలేందుకు సిద్ధమైనమేరకు వారిని గ్రామాలవైపు తీసుకురాదలిచామన్నారు. ఓ కుటుంబానికి రూ.10లక్షలు తొలివిడతలో అందిస్తామని వారు సంపూర్ణంగా గ్రామాల్లోకి వస్తే మరో రూ.5లక్షలు ఇస్తామన్నారు. ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్‌జార్కిహొళితోపాటు పలువురు పాల్గొన్నారు.

రాష్ట్రమంతటా వర్షాలు

● మరో ఐదురోజులపాటు వానలు



సాయి లే అవుట్‌లో జలమయమైన వీధి

బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు జోరందుకున్నాయి. నైరుతి రుతుపవనాలకు ముందే విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి బెంగళూరులో కుండపోత వానకు నగర ప్రజలు తల్లడిల్లారు. ఐపీఎల్ మ్యాచ్ కోసం చిన్నస్వామి స్టేడియానికి వచ్చిన వేలాదిమంది అభిమానులు తడిసి ముద్దయ్యారు. నగరవ్యాప్తంగా వాన హోరెత్తించడంతో రోడ్లపైనే వాహనదారులు గంటలతరబడి పడిగాపులు పడాల్సి వచ్చింది. కేఆర్‌పురం పరిధిలోని సాయి లే అవుట్ నీటమునిగింది. రోడ్లపైనే భారీగా వర్షపునీరు ప్రవహించింది. నగరమంతటా రాత్రి పొద్దుపోయేదాకా వర్షం కురవడంతో జనం ఇబ్బందిపడ్డారు. ఆదివారం సాయంత్రం నగరమంతటా ఒక మోస్తరు వర్షం కురిసింది. మరో ఐదురోజులపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ పరిశోధనశాఖ ప్రకటించింది.

కబళించిన కునుకు..

- బావిలోకి దూసుకెళ్లిన కారు
- ముగ్గురిని బలితీసుకున్న నిద్రమత్తు
- చాకచక్యంగా బయటపడ్డ ఇద్దరు
- పీలేరు మండలం బాలంవారిపల్లె వద్ద ప్రమాదం
- బాధితులు వంట మాస్టర్లు
- క్యాటరింగ్ కోసం వస్తుండగా ప్రమాదం
- శోకసంద్రమైన పీలేరు ఆసుపత్రి



శివానంద, లోకేశ్, చలపతి (ఫైల్)

పీలేరు, మే 18 (ఆంధ్రజ్యోతి): వారంతా రెక్కల కష్టం మీద బతికే వంట మాస్టర్లు. వేర్వేరు ఊర్లకు చెందిన వారైనప్పటికీ వృత్తిరీత్యా ఒకటయ్యారు. ఒక జట్టుగా ఏర్పడి క్యాటరింగ్ కాంట్రాక్టు సంస్థల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎక్కడ ఆర్డర్లు లభిస్తే అక్కడికెళ్లి రుచికరమైన వంటలు చేసేవారు. అలా పీలేరులో ఓ శుభకార్యంలో వంటలు చేయడానికి వస్తూ మృత్యువాతపడ్డారు. మరో పది నిమిషాల్లో పీలేరుకు చేరుకుంటారనుకునేలోపు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయి తమ కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చారు. మరోచోట జరిగిన శుభకార్యంలో వంటలు చేయడం, సుదీర్ఘ ప్రయాణం వల్ల కలిగిన అలసట కారణంగా కారు నడుపుతున్న వ్యక్తికి కలిగిన చిన్న కునుకుపాటుకు మృత్యు ఒడిలోకి జారుకున్నారు. కర్ణాటక రాష్ట్రం చింతామణి, కోలారు ప్రాంతాలకు చెందిన ఐదుగురు వంట మాస్టర్లు ప్రయాణిస్తున్న కారు పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ జి.కురవపల్లె వద్ద రోడ్డుపక్కనున్న పాడుబడిన వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లడంతో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందగా ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ కథనం మేరకు కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపుర జిల్లా చింతామణి తాలూకా ముతకనహళ్లికి చెందిన ఎన్.లోకేశ్, జి.తిప్పారెడ్డి, చాంద్రహళ్లికి చెందిన సీఎం శివానంద, సీవీ సునీల్, కోలారు జిల్లా సుగుటూరుకు చెందిన ఎన్.చలపతి



క్రేన్ సాయంతో బావిలో నుంచి కారును బయటకు తీస్తున్న పోలీసులు, గ్రామస్థులు, అగ్నిమాపక సిబ్బంది

వంటమాస్టర్లుగా జీవనం సాగిస్తున్నారు. వీరు ఆదివారం ఉదయం పీలేరులో జరిగే ఓ శుభకార్యంలో వంటలు చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. తమిళనాడు రాష్ట్రం హోసూరులో శనివారం రాత్రి జరిగిన ఓ శుభకార్యంలో వంటలు చేసిన అనంతరం శివానందకు చెందిన కారులో రాత్రి 12 గంటలకు హోసూరు నుంచి పీలేరుకు బయలుదేరారు. లోకేశ్‌కు డ్రైవింగ్ చేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజాము 4.15 గంటల ప్రాంతంలో కారు పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ జి.కురవపల్లె వద్దకు రాగానే నిద్రమత్తులో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పాడుబడిన వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లి మునిగిపోయింది. ప్రమాదం జరిగిన తీరుకు అప్రమత్తులైన జి.తిప్పారెడ్డి, సునీల్ కారు వెనకున్న అద్దాన్ని గట్టిగా తన్ని దాని ద్వారా బయటకు వచ్చేశారు. సహచరులను కూడా కారులో నుంచి వెలిసి తీసేందుకు ప్రయత్నించినప్పటికీ సఫలం కాలేకపోవడంతో వారు బావి సమీపంలో ఉన్న ఇంటి వద్దకు వెళ్లి ప్రమాదం గురించి తెలియజేశారు. దీంతో ఆ ఇంటి వారు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం గురించి గ్రామస్థులు, పోలీసులకు సమాచారం అందించారు. గ్రామస్థులు చేసిన ప్రయత్నాలూ సఫలం కాకపోయేసరికి పోలీసులు క్రేన్ సాయంతో కారును బావిలో నుంచి వెలికితీశారు. అప్పటికే కారులో చిక్కుకున్న ముగ్గురూ విగతజీవులుగా మారిపోయారు.

మృతుల వివరాలు...

కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపుర జిల్లా చింతామణి తాలూకా ముతకనహళ్లికి చెందిన ఎన్.లోకేశ్ (36). లోకేశ్‌కు భార్య చందన (28), అమూల్య (10), భాస్కర్ (8) ఇద్దరు పిల్లలు ఉన్నారు. కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపుర జిల్లా చింతామణి తాలూకా చాంద్రహళ్లికి చెందిన సీఎం శివానంద (44). ఇతడికి భార్య కవిత (38), చందన (17), భార్గవ్ (15) ఇద్దరు పిల్లలు ఉన్నారు. కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా సుగుటూరుకు చెందిన ఎన్.చలపతి (48). ఇతడికి భార్య చైత్ర (42), వినీల్ (15), వినీత (13) ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సకాలంలో గ్రామస్థులు స్పందించినా..

కారు బావిలోకి దూసుకెళ్లిందన్న విషయం తెలియగానే అటు బాలంవారిపల్లె, కురవపల్లె గ్రామస్థులు స్పందించారు. తమకెందుకులే అని పోలీసులు, ఇతర సాయం కోసం వేచి చూడకుండా పెద్దపెద్ద కర్రలతో కారును బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించారు. కారును నీటిలో నుంచి వెలికి తీసేందుకు తమకు చేతనైన రీతిలో ప్రయత్నించారు. బావిలో ఉన్న నీటిని మోటార్ల ద్వారా తోడేసేందుకు ప్రయత్నించారు. క్రేన్ వచ్చినప్పటికీ విశ్రమించకుండా నీళ్లలోకి దిగి కారులో ఉన్న వారిని కాపాడాలనే తపనతో కారుకు తాళ్లు కట్టడం వంటి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేశారు. అయినప్పటికీ అందులో ఉన్న వారిని కాపాడలేకపోయారు. గ్రామస్థుల సహకారాన్ని అటు పోలీసులు, ఇటు ప్రమాదంలో బయటపడిన వారు అభినందించారు.

ఎమ్మెల్యే పరామర్శ

కురవపల్లె వద్ద కర్ణాటక వాసులకు జరిగిన ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి స్పందించారు. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్‌తో ఫోన్‌లో మాట్లాడి కారులో ఉన్న వారిని కాపాడేందుకు ప్రయత్నించాలని సూచించారు. వెంటనే ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంలో నుంచి సురక్షితంగా బయటపడిన వారితో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. మృతులను వారి స్వస్థలాలకు చేర్చేందుకు అన్ని విధాలా సహకరిస్తామని చెప్పడమే కాకుండా వారి తక్షణ అవసరాల కోసం రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు.

మృతదేహాల అప్పగింత

ప్రమాదంలో మరణించిన వారికి పీలేరు పోలీసులు పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు. ప్రమాదంలో నుంచి సురక్షితంగా బయటపడిన వారితో పాటు వారిని పీలేరుకు పిలిపించిన వారు ప్రమాదం గురించి మరణించిన వారి కుటుంబసభ్యులకు తెలియజేశారు. వారందరూ ఆదివారం మధ్యాహ్నం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని విగతజీవులుగా పడి ఉన్న తమ వారిని చూసి హృదయవిదారకంగా రోదించారు. 'నాలుగు చోట్ల నాలుగు వంటలు చేసుకుని బతికే వాళ్లం, వంట మీద వచ్చే అరకొర ఆదాయంతో బతుకుతున్న వాళ్లం, ఇంటి పెద్దల్ని కోల్పోయి ఇప్పుడు ఎలా బతకాలిరా దేవుడా' అంటూ వారు గుండెలవిసేలా ఏడ్చారు. పోలీసులు మృతదేహాలను వారికి అప్పగించారు.




ప్రమాదం నుంచి బయటపడిన తిప్పారెడ్డి, సునీల్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

వివాహితను పెళ్లి చేసుకున్నాడని.. గ్రామ బహిష్కరణ

● పూజలో పాల్గొన్నారని మరో 16 కుటుంబాలకు కూడా..

బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): వివాహితను పెళ్లి చేసుకున్నాడని ఓ కుటుంబాన్ని ఎనిమిదేళ్లపాటు గ్రామ బహిష్కరణ చేసిన సంఘటన కొప్పళ జిల్లాలో వెలుగు చూసింది. చిలకముక్కి గ్రామానికి చెందిన హనుమంతప్ప, మంజుళ దంపతులతోపాటు హనుమంతప్ప తల్లిదండ్రులను గ్రామం నుంచి బహిష్కరించారు. వీరు పర్వతమల్లయ్య తెగకు చెందినవారు. ఎనిమిదేళ్లుగా వివిధ గ్రామాల్లో నివసించి అక్కడే జీవనం సాగించిన కుటుంబం ఇటీవలే చిలకముక్కి గ్రామ శివారుకు వచ్చి ఓ షెడ్ ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. శివాజీ, గంగమ్మల కుమారుడు హనుమంతప్ప అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తుండేవాడు. అయితే యువతి బంధువులు వీరి ప్రేమను అంగీకరించలేదు. మరో వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. కొంతకాలం తర్వాత ప్రేమికుడిని వదులుకోలేక యువతి, హనుమంతప్పతో కలసి పరారయ్యారు. యువతి మంజుళ కుటుంబీకులను పర్వతమల్లయ్య సామాజికవర్గం ఎనిమిదేళ్లపాటు బహిష్కరించారు. కొన్ని రోజుల తర్వాత రాజీ పంచాయితీలు కొనసాగాయి. హనుమంతప్ప ఇంటికి ఎవరైనా ఇష్టం ఉంటే వెళ్లవచ్చునని తీర్మానించారు. ఇటీవలే హనుమంతప్ప ఇంట దేవుడి పూజ జరిపారు. నాలుగైదు కుటుంబాలకు చెందినవారు వెళ్లి భోజనం చేశారు. ప్రస్తుతం వీరింట్లో ఎవరెవరు భోజనం చేశారో వారందరినీ బహిష్కరించాలని తీర్మానించారు. గ్రామపంచాయతీ మాజీ సభ్యుడు శంకరప్ప బోగికి బహిష్కార వేటు పడింది. హనుమంతప్ప తండ్రి శివాజీ, తల్లి గంగమ్మ ఆవేదనతో మమ్మల్ని సమాజంలోకి చేర్చుకోవాలని కోరుకుంటున్నారు. మా కుటుంబంలో ఎవరైనా మృతి చెందినా, పండుగ, పూజలు ఏం చేసినా ఎవరూ రావడం లేదని, మేం ఎవరింటికి వెళ్లలేకపోతున్నామని, ఇది మా కులపెద్ద తీర్మానమైందన్నారు. మేం జరిమానా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని, దానికి అవకాశం ఇవ్వడం లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా హనుమంతప్ప భార్యతోపాటు వివిధ గ్రామాల్లో గడిపి వచ్చాడన్నారు. వారు 8 ఏళ్లుగా ప్రేమించుకున్నారన్నారు. మంజుళకు బాల్యవివాహం జరిగిందని, వయసు వచ్చాక ప్రేమించిన హనుమంతప్పతో వెళ్లారన్నారు. ఇటీవల నాలుగు నెలలక్రితం సొంతూరుకు వచ్చామని, ఊరి బయట ఓ షెడ్‌లో ఉన్నామన్నారు. చిలకముక్కి గ్రామంలో పర్వతమల్లయ్య కుటుంబాలు సుమారు 80 దాకా ఉండగా ప్రస్తుతం 16 కుటుంబాలను బహిష్కరించారు. ఇదే విషయమై గ్రామపంచాయతీ మాజీ సభ్యుడు శంకరప్ప మాట్లాడుతూ హనుమంతప్ప తండ్రి శివాజీ ఇంట్లో పూజ ఉంటే వెళ్లామని అందుకు ఏకంగా 16 కుటుంబాలను వెలి వేశారన్నారు. జిల్లా యంత్రాంగం స్పందించాలని కోరుతున్నారు.



శివరాజ్ ఇంట సినీ ప్రముఖుల రహస్య భేటీ

బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): శాండల్‌వుడ్‌లో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై సినిమారంగానికి చెందిన ప్రముఖులు రహస్యంగా భేటీ అయ్యారు. నాగవారలోని హ్యాట్రిక్ హీరో శివరాజ్‌కుమార్ ఇంట్లో శనివారం కలిశారు. ప్రముఖ నటులు గణేశ్, దునియా విజయ్, ధ్రువసర్జాతోపాటు నటులు, నిర్మాతలు, పంపిణీదారులు పాల్గొన్నారు. సినిమారంగానికి జరుగుతున్న నష్టాలపైనే ప్రధానంగా చర్చించినట్టు తెలుస్తోంది. సినిమా టాకీస్‌లు మూతపడే స్థాయికి చేరాయని పలువురు నిర్మాతలు అభిప్రాయపడినట్టు తెలుస్తోంది. ప్రధానంగా స్టార్ హీరోల సినిమాలకే ప్రజలు థియేటర్‌లకు వస్తున్నారన్నారు. హీరోలు నాలుగైదేళ్లకు ఒక సినిమా చేస్తే సినిమారంగం ఏం కావాలని పరిశ్రమపై ఆధారపడ్డ వేలాది కుటుంబాలు ప్రత్యామ్నాయంవైపు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని పలువురు అభిప్రాయపడ్డారు. స్టార్ హీరోల సినిమాలు నిరంతరంగా ఉంటేనే మనుగడ సాధ్యమని కొందరు ప్రస్తావించారు. థియేటర్లకు ఆస్తిపన్ను, సబ్సిడీ, తక్కువ వడ్డీతో రుణాలు అవసరమన్నారు. సుమారు గంటన్నరకుపైగా చర్చలు జరిగాయి. ఐపీఎల్ టోర్నీ వేళ 2-3 నెలలపాటు పెద్దసినిమాలు రావడం లేదని, పాన్ ఇండియా సినిమాల పిచ్చిలో చిన్న సినిమాలు నిర్మాణం కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పెద్ద సినిమాలు నాలుగైదేళ్లకోసారి వస్తే ఏం లాభమని డిస్ట్రిబ్యూటర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. శాండల్‌వుడ్‌లో ప్రధాన హీరోలు యశ్, సుదీప్, రిషబ్‌శెట్టి, రక్షిత్‌శెట్టి సినిమాలు తగ్గించారని, రెండుమూడేళ్లకోసారి వారి సినిమాలు విడుదల అవుతున్నాయన్నారు. సింగిల్‌స్క్రీన్ థియేటర్‌లు మూతపడే పరిస్థితి వచ్చిందని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత ఏడాది మ్యాక్స్, యూఐ సినిమాలు కొంత వెసులుబాటు అనిపించినా ఆ తర్వాత ఐదు నెలలపాటు ఒక కన్నడ సినిమా హిట్ కాలేదన్నారు కాంతార 1, యక్కా, కేడీ, 45, సినిమాలు మినహాయిస్తే మరే సినిమాలు చెప్పుకోదగ్గరీతిలో ఆడలేదన్నారు. ఈ ఏడాదిలో ఒక మంచి సినిమా వస్తుందనే ఆశలు పోతున్నాయని, అటువంటి పరిస్థితి లేదన్నారు. సినిమారంగానికి సంబంధించిన సమస్యలపై త్వరలోనే సీఎం సిద్దరామయ్యను కలవాలని తీర్మానించారు. ఫిలించాంబర్ అధ్యక్షుడు నరసింహులు మీడియాతో మాట్లాడుతూ పలు అంశాలపై చర్చలు జరిపామని త్వరలోనే ముఖ్యమంత్రితో హీరో శివరాజ్‌కుమార్ సారథ్యంలో భేటీ అవుతామన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1586.15	1,577.56
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,004	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,338	138
నీటి నిల్వ (టీఎంసీలు)	8.10	3.40

22న హనుమజ్జయంతి వేడుకలు

బళ్లారిరూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వర నగర్‌లో వెలసిన అభయ వరదాంజనేయ స్వామి ఆలయంలో 22వ తేదీన హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ధనుంజయ తెలిపారు. స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, విశేషాలంకరణ, పవమాన హోమం, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

21న హులిగమ్మదేవి మహా రథోత్సవం



అలంకరణలో అమ్మవారు

కంప్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లాలోని హులిగమ్మ దేవి రథోత్సవం 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 18 నుండి వివిధ ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. మహా రథోత్సవం 21న సాయంత్రం 5.30 గంటలకు జరుగుతున్నట్లు తెలిపారు. 22న బలిదండికి ఆరోహణ, శుక్రవారం ఏకాదశి రోజున అమ్మవారికి పాయస ప్రసాదం, శనివారం ద్వాదశి వేకువజామున అగ్నిగుండం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆలయానికి వచ్చే భక్తాదులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.

వైభవంగా సయ్యద్‌షా ఉరుసు



సయ్యద్‌షా సమాధిని దర్శించుకుంటున్న భక్తులు

సిరుగుప్ప, మే 18(ఆంధ్రజ్యోతి): సయ్యద్ షా కుర్షిద్ ఖాద్రి ఉరుసు వైభవంగా నిర్వహించారు. పట్టణం 1వ వార్డులో ఉన్న ఖాద్రి సమాధిని పట్టణ ప్రజలు దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గంధం, జియారత్, ఉరుసు కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సభ్యులు తాత వారికి పూలమాలలతో అలంకరణ చేసి ఆశీర్వాదాలు పొందారు.

కేఎస్‌ఈ అవార్డుల ప్రదానం



అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు

విజయనగరం (హొస్పేట), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): హోస్పేట పట్టణంలో ఆదివారం కేఎస్‌ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వసంతమ్మ అతిథులను స్వాగతించి, డీన్‌లను స్వాగతించారు. ఎస్‌డీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మంజునాథ కేఎస్‌ఈ అవార్డుల ప్రదానోత్సవాన్ని చేపట్టారు. డాక్టర్ కడ్లి ధన్యవాదాలను ప్రతిపాదించారు. ప్రొఫెసర్లు వీణ, ఉషా గుజ్జల్ కార్యక్రమానికి స్వరాలు సమకూర్చారు. అనంతరం కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. ప్రిన్సిపాల్ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ పార్వతి కడ్లి, సించన-2025 ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ వసంతమ్మ, ఇతర ప్రముఖులు, అన్ని విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నివాస ప్రాంతంలోకి కొండచిలువ

బళ్లారి సిటీ, మే 18(ఆంధ్రజ్యోతి): సండూర్ పట్టణ శివార్లలోని నారిహళ్ల నది గుండా ఒక కొండచిలువ నివాస ప్రాంతంలోకి ప్రవేశించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఉదయం కురిసిన వర్షంలో వాగులో నీటి ప్రవాహం వల్ల కొండచిలువ బయటపడి బహిరంగ ప్రదేశంలో కనిపించింది. కొండచిలువ 13అడుగుల పొడవు ఉంది. అక్కడే ఉన్న లారీ డ్రైవర్లు దానిని రక్షించి అడవిలోకి వదిలారు.



కంప్లి: యశ్వంత్‌నగర్ వద్ద పొంగి ప్రవహిస్తున్న చెక్‌డ్యాం



కంప్లి: నరహల్లి జలాశయంలోకి చేరిన నీరు



బళ్లారిలో కురుస్తున్న వర్షం

బళ్లారి, విజయనగర జిల్లాల్లో వాన వెల్లువ

- రెండ్రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



సిరగుప్ప: ఆగలూరు హోసళ్లి గ్రామం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

కంప్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): బళ్లారి, విజయనగరం ఉభయ జిల్లాలో శని, ఆది వారాలు రాత్రివేళల్లో భారీ వర్షం కురిసింది. జిల్లా పరిధిలోని సండూరు తాలుకా, యశ్వంత్ నగర్ వద్ద భారీ వర్షాలు కురిశాయి. రైల్వే ట్రాక్ వద్ద ఉప్పొంగి నీరు ప్రవహించాయి. నరహళ్ల జలాశయంలోకి భారీగా నీరు చేరుతున్నాయి. తోరణగల్లు వద్ద రోడ్లపై నీరు నిలిచిపోయాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హరప్పనహళ్లిలో రోడ్లపై నీరు చేరుకుని ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

బళ్లారిరూరల్: బళ్లారి నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రాత్రి తొమ్మిది గంటల నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామాలకు రాకపోకలు అంతరాయం ఏర్పడింది. హగరి సమీపంలో ఉన్న వేదవతి నది రాత్రి కురిసిన వర్షంతో నీరు ప్రవహిస్తున్నాయి. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కిరాణ షాపుల్లో నీరు చేరి వస్తువులు తడిసిపోయాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం నిల్వ ఉన్న నీటిని మోటార్ల ద్వారా బయటకు వంపే పనిలో వ్యాపారులు నిమగ్నమయ్యారు.

సిరుగుప్ప: ఉరుములు, మెరుపులు, వర్షాలతో సిరుగుప్ప తాలుకా అతలాకుతలమవుతోంది. ఆదివారం భారీ వర్షం కురిసింది. వర్షాలతో హగరి నది పొంగిపొర్లుతోంది. కాదలూరు, హోసళ్లి వద్ద రోడ్డుపైనే వర్షపునీరు ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలతో ఒక పక్క రైతులు హర్షం వ్యక్తం చేస్తుంటే మరోవైపు సామాన్య ప్రజలు ఎన్నడూ లేని విధంగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, పిడుగులు, వడగండ్ల వాన కురవడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. శనివారం రాత్రి సిరుగుప్ప పట్టణంలో 37.2మి.మీ, సిరిగేరిలో 48.2, మిగిలిన చోట్ల 30 మి.మీపైగా వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ నరసప్ప తెలిపారు.



దుకాణాల్లోకి చేరిన వర్షపునీరు

తోరణగల్లు: సండూరు తాలుకాలో భారీ వర్షం కురిసింది. సండూరులో 54.8 మి.మీ వర్షపాతం నమోదైంది. చుర్నూరులో 40.0, కురేకుప్ప 57.2, విఠలాపురంలో 30.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

తగ్గిన బొప్పాయి ధర

- ఆందోళనలో రైతులు
- చెట్టుమీదే కుళ్లిపోతున్న కాయలు

బళ్లారి సిటీ, మే 18(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో బొప్పాయి పండ్ల ధర పడిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తాలూకాలో 25 హెక్టార్లలో రైతులు బొప్పాయిని సాగుచేస్తున్నారు. దిగుబడి బాగా వచ్చింది. రైతులు అధిక లాభాలను ఆశించారు. ధరల పతనం, పంటకు పెట్టిన ఖర్చులు తడిసిమోపెడయ్యాయి. వ్యాపారులు కాయలు ఒకనేందుకు ముందుకు రాకపోవడంతో చెట్లపై కుళ్లిపోతున్నాయి. జనవరి నుంచి మార్చి వరకు బొప్పాయి ధర కిలోకు రూ.35 నుంచి 40 వరకు ఉండేది. అయితే ఏప్రిల్ నుంచి రూ. 3 నుంచి 3-50కి పడిపోయింది. తోటలలో బొప్పాయి పంట ఊహించిన దానికంటే ఎక్కువ దిగుబడి రావడంతో రైతులు ఏమి చేయలాలో దిక్కుతోచని పరస్థితుల్లో పడ్డారు. అమ్మేందుకు ధర లేకపోవడంతో చెట్లపై కాయలను వదిలేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరింత కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. కాయలు కోయడం కంటే చెట్లపైనే విదిలేయడం మంచిదని అంటున్నారు. గత మూడు సంవత్సరాలుగా ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటున్నామని రైతు రాజా వాపోయాడు. ప్రభుత్వం స్పందించి బొప్పాయి రైతులను ఆదుకోవాలని కోరుతున్నాడు.



చెట్లమీదే వదిలేసిన కాయలను చూపుతున్న రైతు

రేపు రెండో సిద్దరామోత్సవం: మంత్రి జమీర్



మాట్లాడుతున్న మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్

బళ్లారి సిటీ, మే 18(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హొసపేటలోని క్రీడామైదానంలో మంగళవారం అంకిత సభ రెండవ సిద్దరామోత్సవంగా నిర్వహిస్తున్నట్లు మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్‌అన్నారు. మొదటి సిద్దరామోత్సవం ఇప్పటికే దావణగెరెలో జరిగిందని ఆయన అన్నారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సమావేశానికి 3,700 రాష్ట్ర రవాణా బస్సులు రిజర్వ్ చేశామన్నారు. విడిగా 2,000 బస్సులను తాను రిజర్వ్ చేసినట్లు తెలిపారు. చాలా మంది ఎమ్మెల్యేలు పాఠశాల, కళాశాలల బస్సులను కూడా వినియోగిస్తున్నారన్నారు. 3 లక్షలకుపైగా ప్రజలు ఉత్సవంలో పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. 1.50లక్షల కుర్చీలు వేశారని, 2లక్షల మందికి ఆహారం అందిస్తామన్నారు. ఉదయం 8 నుంచి 500కౌంటర్లలో భోజనం అందుబాటులో ఉంటుందన్నారు. 50వేల భోజన ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. హొసపేట చుట్టూ 200 ఎకరాల విస్తీర్ణంలో వాహనాల పార్కింగ్‌కు కేటాయించామన్నారు. కార్యక్రమం 10 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటలకు ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే గవియప్ప, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలకు పంపండి

కంప్లి, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని వీఆర్‌ఫర్‌యూ సంస్థ జిల్లా ఆఫీస్ బేరర్, రచయిత గొడె శివరాజ్ అన్నారు. శిరిగేరి గ్రామంలో ఆదివారం మొదటి వార్డులోని జనతా కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు, పిల్లలను పాఠశాలకు చేర్పించడం గురించి అవగాహన కల్పించారు. పాఠశాల మానేసిన పిల్లలను చేర్పించేందుకు ఆ సంస్థ ఆదివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సంస్థ గౌరవాధ్యక్షుడు హనుమేష్ మాట్లాడుతూ విద్యకు గొప్ప శక్తి వుందని, దాని కోసం ప్రాణాలర్పించిన గొప్ప వ్యక్తులు మనకు స్ఫూర్తినిస్తారన్నారు. ప్రధానోపాధ్యాయులు ఆర్‌బీ శివశంకర్, గోవిందరాజు మాట్లాడుతూ ప్రభుత్వం మీకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. రిటైర్డ్ గణిత ఉపాధ్యాయులు రాణిప్ప, హనుమేష్, నాగరాజు, కొల్లిశేఖర్, ఆలం బాషా, కల్లుడి పంప, శివాజీరావు, కాళీ పంపాపతి, సంజీవని, శివరాం, పునీత్, సిందోళ పాల్గొన్నారు.



సిరిగేరిలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

లక్ష మందికి ఇళ్ల స్థలాల హక్కు పత్రాలు



అధికారులతో చర్చిస్తున్న మంత్రి ఎన్ఎస్ భోసరాజు

రాయచూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైన సందర్భంగా మంగళవారం విజయనగర జిల్లా హొస్పేట్‌లో సాధన సమావేశం ఏర్పాటు చేశామని చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.భోసరాజు తెలిపారు. లక్ష మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల హక్కు పత్రాలను అందజేస్తున్నామన్నారు. సాధన సమావేశం నిర్వహణకు సంబంధించి ఆదివారం జిల్లాలోని మాన్వి పట్టణ ప్రభుత్వ అతిథి గృహంలో అధికారులతో మంత్రి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండేళ్లలో తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి అనేక ప్రజాహిత కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలననందించేందుకు మంత్రిమండలి సముచిత నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలోని మాన్వి, సిరవార తాలూకులకు చెందిన లబ్ధిదారులకు హక్కు పత్రాలను అందజేస్తామన్నారు. మాన్వి ఎమ్మెల్యే హంపయ్య నాయక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

డీఎస్ఎస్ కమిటీ కన్వీనర్‌గా గుండప్ప



గుండప్పను అభినందిస్తున్న నాయకులు

కంప్లి, మే 18(ఆంధ్రజ్యోతి): డీఎస్ఎస్ కమిటీ కన్వీనర్‌గా హెచ్. గుండప్పను నియమించినట్లు దళిత సంఘర్షణ సమితి జిల్లా సమన్వయకర్త గోవర్ధన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ కృష్ణప్ప దోపిడీకి గురైన పేదల తరఫున ఒక సంస్థను ఏర్పాటు చేశారని, కొత్త కమిటీ కొత్త ఆఫీసు బేరర్లు సంస్థ పురోగతికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కోఆర్డినేటర్ మల్లికార్జున, మాజీ కోఆర్డినేటర్ లక్ష్మీపతి నేతృత్వంలో స్థానిక చక్కెర కర్మాగారంలోని కోదండరామ ఆలయ ప్రాంగణంలో ఆదివారం సమావేశంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంస్థ ఒక సైద్ధాంతిక ఉద్యమమని, సంస్థను బలోపేతం చేయడానికి అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆఫీసు బేరర్లను నియమించారు. దేవలాపురం కార్యవర్గ సభ్యులుగా హెచ్ గుండప్ప, మరియమ్మ, సానాపూర్, చంద్రశేఖర్, ఎమ్మిగనూరు, మహేష్ మేత్రి, బాలప్ప, ఈరన్న, రాంసాగర్, పక్కీరప్ప, బాలు షుగర్ ఫ్యాక్టరీ, బసప్ప, మేత్రి, హులుగప్ప, హంపదేవనహళ్లి, పరశురాముడు, కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కోఆర్డినేటర్ సన్న నాగరాజు, నటరాజుగౌడ్, తోటరాజు, వీరభద్ర, కార్యవర్గ సభ్యులు, ఎమ్మిగనూరు, జడెప్ప పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య



హత్యకు గురైన సాదిక్(ఫైల్)



నిందితుడు కరీం

రాయచూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జాకిర్ హుసేన్ సర్కిల్ వద్ద ఆదివారం ఉదయం ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఇద్దరు యువకుల మధ్య చలరేగిన ఘర్షణ మాటమాట పెరిగి హత్యకు దారి తీసింది. వివరాల్లోకి వెళితే... సాధిక్, కరీం అనే ఇద్దరు స్నేహితులు ఉదయం 4:30 టంగలలోపే తోపుడు బండిపై ఇడ్లీలు చేసేందుకు వచ్చారు. ఈ క్రమంలో సాధిక్, కరీం మధ్య మాటమాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో కరీం చాకుతో పొడవడంతో నగరంలోని జహిరాబాద్ ఏరియాకు చెందిన సాధిక్(27) తీవ్రంగా గాయపడ్డాడు. అతినిని స్థానికులు రిమ్స్ ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగా దారి మధ్యలోనే మృతిచెందాడు. నిందితుడు జహానిమొహల్లా ఏరియాకు చెందిన కరీంకు మరో ఇద్దరు స్నేహితులు సహకరించినట్లు ప్రత్యక్ష సాక్షలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి హత్యకు సంబంధించి సంచలనమైన ఆరోపణలు చేశాడు. నిందితుడు కరీం కొంతకాలంగా గంజాయి వ్యాపారం చేస్తున్నాడని దీన్ని తన కుమారుడు సాధిక్ అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఇద్దరి మధ్య ఇప్పటికే మూడు-నాల్గు సార్లు ఘర్షణ జరిగినట్లు ఆయన తెలిపారు. కార్మికులు, కళాశాల విద్యార్థులు, యువతి-యువకులు గంజాయికి అలవాటు పడుతున్నారని, నీ వ్యాపారం కోసం యువకులను బలి చేయవద్దంటూ పలుమార్లు సాధిక్ హెచ్చరించడాన్ని జీర్ణించుకోలేని కరీం అదును చూసి హత్యకు పాల్పడినట్లు బాబా ఆరోపించారు. విషయం తెలుసుకున్న సదర్‌బజార్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. నిందితుడు కరీంను అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోడల్ సిటీగా రాయచూరు అభివృద్ధి

- కమిషనర్ జుబిన్ మహాపాత్రో



13వ వార్డులో బీ-ఖాతాలు అందజేస్తున్న కమిషనర్

రాయచూరు, మే 18(ఆంధ్రజ్యోతి): వచ్చే రెండేళ్లలోగా నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు అన్ని అభివృదిధ పనులను పూర్తి చేసి జాతీయ స్థాయిలోనే మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మహానగర పాలికె కమిషనర్ జుబిన్ మహాపాత్రో తెలిపారు. ఇందు కోసం ఇప్పటినుంచే ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. నగరంలోని 13వ వార్డు పరిధిలో ఇళ్ల హక్కులను సంబంధించి బీ-ఖాతాలను ఆదివారం కమిషనర్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అనేక దరఖాస్తులను త్వరితగతిన క్లియర్ చేసేందుకు తక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమస్యలకు సంబంధించి పౌరులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని, ఇందుకోసం సహాయవాణిని అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఎప్పుడైనా స్థానికులు తమ సమస్యలను ఆ నంబర్ ద్వారా రాయచూరు మహానగర పాలికె దృష్టికి తీసుకురావచ్చన్నారు. రానున్న 50 రోజుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి అత్యంత ఆధునిక యంత్రాలను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛతతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. రవీంద్ర జల్దార్ అనేవ్యక్తి నగరంలో ఉన్న పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తెచ్చారు.

హోసూరు జోన్



డ్యాం నుంచి నీరు విడుదల చేయడంతో వస్తున్న నురగ

డ్యాంకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

హోసూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): తెన్‌పెన్నై నదీ పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో కెలవరపల్లి డ్యాంకి ఇన్‌ఫ్లో పెరిగింది. తమిళనాడు, కర్ణాటకలోని నదీ పరీవాహక ప్రాంతాలలో కొన్నిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో డ్యామ్‌లోకి క్రమేపీ నీరు పెరుగుతోంది. కాగా రెండు రోజులుగా డ్యామ్ నుంచి కూడా నీటిని విడుదల చేస్తుండగా నురగ ఎక్కువగా వస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం అవుతోంది. శనివారం 492 క్యూసెక్కులు ఉండగా తాజాగా 572 క్యూసెక్కులకు పెరిగింది. డ్యామ్ సామర్థ్యం 44.28 అడుగులు కాగా 41.33 అడుగులకు చేరింది.

వంట గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

హోసూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి హోసూరుకు లైసెన్స్ లేకుండా తీసుకొచ్చిన 58 వంటగ్యాస్ సిలిండర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరిహద్దులోని కొత్తకొండపల్లి బస్టాండ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఓమ్ని వ్యాన్, కార్గు వాహనాన్ని పరిశీలించారు. కృష్ణగిరి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో వంటగ్యాస్ సిలిండర్లను లైసెన్స్ లేకుండా రవాణా చేస్తున్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఓమ్ని వ్యాన్ నుంచి 20 వంటగ్యాస్ సిలిండర్లు, కార్గో నుంచి 38 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. కంబపల్లిలోని సమతువపురానికి చెందిన ఓమ్ని వ్యాన్ డ్రైవర్ సంతోష్ (31), కార్గో వాహన డ్రైవర్ ప్రశాంత్ (30) గా గుర్తించి కేసు నమోదు చేసుకున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ




ఉత్సాహంగా తిరంగా ర్యాలీ

హోసూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై నగరంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు సహా పలువురు 500మందికిపైగా జాతీయ జెండాలతో పాల్గొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, సైనికులకు కృతజ్ఞతలు తెల్పుతూ శనివారం ర్యాలీ కొనసాగింది. హోసూరులోని రాంనగర్‌లో ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారులమీదుగా కామరాజ్ కాలనీలో ముగిసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్, మాజీ అధ్యక్షుడు అణ్ణామలై, ప్రముఖ కార్యనిర్వాహకులు, మాజీ సైనికులు పాల్గొన్నారు. కుండపోత వర్షంలోనూ ర్యాలీ కొనసాగడం విశేషం. 'రఘుపతి రాఘవ రాజారాం...' పాటను ఆలపించి కార్యక్రమాన్ని ముగించారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

జంషెడ్‌జీ టాటా (వర్ధంతి)



భారత పారిశ్రామిక పితా మహాగా పేరొందిన జంషెడ్‌జీ టాటా 1839 మార్చి 3న గుజరాత్‌లోని నవశ్రీలో జన్మించారు. పారిశ్రామికవేత్తగా టాటా గ్రూప్‌ను ఏర్పాటు చేసి దేశంలోనే అతిపెద్ద సంస్థగా విస్తరింపచేశారు. పారిశ్రామిక రంగాన్ని ఎంత ప్రభావితం చేశారంటే టాటాను 'వన్‌మ్యాన్ ప్లానింగ్ కమిషన్'గా తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అభివర్ణించారు. టాటా ఐరన్, స్టీల్‌వర్క్‌తో పాటు ఆధునిక భారతీయ వ్యాపారానికి పునాదులు వేశారు. ఐఐఎస్‌సీ బెంగళూరు, టాటా పవర్ కంపెనీలను స్థాపించారు. 1904 మే 19న కన్నుమూశారు.

అరియకుడి రామానుజ అయ్యంగార్ (జయంతి)



అరియకుడి రామానుజ అయ్యంగార్ 1890 మే 19న జన్మించారు. కర్ణాటక గాత్ర సంగీత విద్వాంసులు. పాడడంలో సరికొత్త శైలిని అభివృద్ధి చేశాడు. అరియకుడి సంప్రదాయంగా ఆయన శిష్యులు అనుసరిస్తున్నారు. కర్ణాటక సంగీత కచేరీలలో కొత్త పద్ధతులను స్థిరపరిచారు. సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ లభించింది. 1958లో 'పద్మభూషణ్' పురస్కారం అందుకున్నారు. 1967 జనవరి 23న కన్నుమూశారు.

గుడిపాటి వెంకటచలం (జయంతి)



'చలం'గా పేరొందిన గుడిపాటి వెంకటచలం 1894 మే 19న మద్రాసు నగరంలో జన్మించారు. సుప్రసిద్ధ తెలుగు రచయిత, వేదాంతి, సంఘసంస్కర్త, ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన అతిముఖ్యమైన వ్యక్తులలో చలం ఒకరు. ఆయన రచనలు చాలావరకు స్త్రీల జీవితాలను ఇతివృత్తంగా చేసుకుని ఉంటాయి. సమాజంలో వారికి ఎదురయ్యే శారీరక, మానసిక హింసలు, వాటిని వారు ఎదుర్కొనే విధానాలను చర్చించాడు. 1979 మే 4న కన్నుమూశారు.

నీలం సంజీవరెడ్డి (జయంతి)



నీలం సంజీవరెడ్డి 1913 మే 19న అనంతపురం జిల్లా ఇల్లూరు గ్రామంలో జన్మించారు. భారత 6వ రాష్ట్రపతిగా 1977-82 మధ్య వ్యవహరించారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా, లోక్‌సభ సభాపతిగా, ఆంధ్రరాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, సంయుక్త మద్రాసు రాష్ట్రంలో మంత్రిగా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వివిధ పదవులను అలంకరించి ప్రజల మన్ననలు పొందిన రాజకీయవేత్త. లోక్‌సభ సభాపతిగా ఎన్నిక కాగానే తన పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి మంచి వాతావరణం నెలకొల్పి స్పీకర్ పదవికే వన్నె తెచ్చిన రాయలసీమ రాజకీయ ఆణిముత్యం. 1996 జూన్ 1న బెంగళూరులో కన్నుమూశారు.

పి. లీల (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత పొరయత్తు లీల 1934 మే 19న జన్మించారు. దక్షిణభారత నేపథ్యగాయని, మలయాళ చిత్రరంగంలో ప్రప్రథమ నేపథ్యగాయని. తమిళ, మలయాళ, తెలుగు భాషల్లో 15వేలకు పైగా పాటలు పాడారు. లవకుశ, మాయాబజారు, పాతాళభైరవి, పాండవ వనవాసం, గుండమ్మకథ, మిస్సమ్మ తదితర సినిమాల్లో ఆమె పాడిన పాటలు ఎంతో ప్రజాదరణ పొందాయి. కలైమామణి, గానకోకిల, గానమణి తదితర పురస్కారాలు పొందారు. 2005 అక్టోబరు 31న కన్నుమూశారు.

గిరీశ్ కర్నాడ్ (జయంతి)




గిరీశ్ రఘునాథ కర్నాడ్ 1938 మే 19న మహారాష్ట్రలోని మథేరాలో జన్మించారు. రచయిత, సినిమా దర్శకుడు, నటుడు, కవి. కన్నడ సాహిత్యానికి వన్నె తెచ్చిన నాటక, సాహితీవేత్త. కర్ణాటకలో ఏడో జ్ఞానపీఠ పురస్కారగ్రహీత. సమకాలీన సాహితీవేత్తలు, పెద్దవారిపట్ల అభిమానం చూపేవారు. ఇద్దరు కన్నడ కవుల కావ్యాలను చలనచిత్రాలుగా వెండితెరకెక్కించిన ఘనత ఆయన సొంతం. తెలుగులో ధర్మచక్రం, శంకర్‌దాదా ఎంబిబిఎస్, ప్రేమికుడు తదితర సినిమాలలో నటించారు. 2019 జూన్ 10న కన్నుమూశారు.

రస్కిన్ బాండ్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' రస్కిన్‌బాండ్ 1934 మే 19న జన్మించారు. బ్రిటీష్ మూలాలు కలిగిన భారతీయ రచయిత. తనను దత్తత పొందిన కుటుంబంతో కలసి ఉత్తరాఖండ్ రాష్ట్రం ముస్సోరిలోని లౌండర్‌లో నివసిస్తున్నారు. పలు పత్రికలకు కవితలు, కథలు రాశారు. బాలల సాహిత్య అభివృద్ధిలో ఆయన పాత్రను భారత విద్యామండలి గుర్తించింది. 'పద్మశ్రీ', సాహిత్య అకాడమీ పురస్కారం, జీవితసాఫల్య పురస్కారం ఇతర గౌరవాలు అందుకున్నారు.

నవాజుద్దీన్ సిద్దికి (పుట్టినరోజు)



నవాజుద్దీన్ సిద్దికి 1974 మే 19న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ముజాఫ్ఫర్ నగర్, బుధానలో జన్మించారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా పూర్వ విద్యార్థి. సినిమా నటుడిగా పేరొందారు. 1999లో అమీర్‌ఖాన్ హీరోగా నటించిన 'సర్ఫరోష్' చిత్రం ద్వారా సినీ రంగంలోకి ప్రవేశించారు. పాన్‌సింగ్ తోమర్, పేట, హీరోపంతి2 సినిమాలు ఎంతో గుర్తింపు ఇచ్చాయి.

పశువుల సంత ఆదాయం రూ. 4.13లక్షలు

అనంతపురం రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు పశువులసంతతో రూ. 4,13,510 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ. 2,52,120, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,61,390 వచ్చిందని తెలిపారు.

బెంగళూరు విమానాశ్రయానికి రూ.510 కోట్ల లాభం

బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ 16ఏళ్లలో రికార్డుస్థాయిలో లాభాలు సాధ్యమైనట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ ప్రకటించారు. ఈ ఏడాది 510 కోట్ల రూపాయలు నికరలాభం వచ్చిందన్నారు. ఎయిర్‌పోర్ట్‌కు ఏసీఐ నుంచి పర్యావరణ సంరక్షణలో ఉత్తమ బహుమతి సాధించినట్టు తెలిపారు. ఆదివారం బెంగళూరులో చీఫ్ సెక్రటరీ మీడియాతో మాట్లాడుతూ 2008లో ఎయిర్‌పోర్ట్ ప్రారంభమైందన్నారు. అప్పటినుంచి ఆశించినంత లాభాలు రాలేదన్నారు. 2023-24లో రూ.23కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 510 కోట్ల రూపాయలు లాభం వచ్చిందన్నారు. ఎయిర్‌పోర్ట్ ఆదాయంలో 43శాతం పెరిగిందని తద్వారా రూ.3237 కోట్ల లావాదేవీలు జరిగాయన్నారు. టర్మినల్-2 విస్తరణ తర్వాత ప్రయాణీకుల సంఖ్య పెరగడం ద్వారా ఆర్థికంగా పురోగతి సాధ్యమైందన్నారు. గత ఏడాదితో పోల్చితే 11.6 శాతం ప్రగతి సాధ్యమైందని, దేశీయ ప్రయాణీకులు 10శాతం, అంతర్జాతీయ ప్రయాణీకులు 25శాతం పెరిగారన్నారు. సరుకు రవాణాలోనూ గణనీయ ప్రగతి సాధ్యమైందన్నారు. 16వేల కోట్ల రూపాయల పెట్టుబడులు



సాధించేందుకు ప్రణాళికలు రూపొందిచనట్టు తెలిపారు. బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు ఎయిర్‌పోర్ట్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ (ఏసీఐ) కార్బన్ అక్రెడిటేషన్ కార్యక్రమంలో లెవెల్ 5లో గుర్తింపు పొందిన ఆసియాలో తొలి విమానాశ్రయమన్నారు.

పంటలకు తీవ్ర నష్టం

బంగారపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): బంగారపేట తాలూకా వ్యాప్తంగా నాలుగురోజులుగా అడపాదడపా వర్షం కురుస్తోంది. అయితే పట్టణంలోని మురుగుకాలువలు పూడికవల్ల వర్షపునీరు సజావుగా ప్రవహించక రోడ్డుపైకి వస్తోంది. దీంతో వాహనదారులు, ప్రజలు సంచారానికి ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని బాలచంద్ర థియేటర్ సమీపంలోని కాలువలు చెత్తతో నిండాయి. పురసభ నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాంతంలో సమస్య అధికమైంది. లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి వర్షపునీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా ఈదురుగాలుల కారణంగా తాలూకాలోని పలు గ్రామాలలో విద్యుత్‌స్తంభాలు, పశువులకొట్టాలు దెబ్బతిన్నాయి. ప్రత్యేకించి తమలపాకుల తోట కూలిపోవడంతో అపారనష్టం వాటిల్లింది. పోలేనహళ్ళి మెయిన్ రోడ్డుపై భారీ చెట్టు కూలడంతో విద్యుత్‌స్తంభం కూడా కూలింది. దీంతో రోజంతా ఈ గ్రామం పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకొంది. పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. కాగా వర్షం వల్ల ఏర్పడిన నష్టాలకు సంబంధించి తోటలశాఖ లేదా రెవెన్యూశాఖకు సంబంధిత రికార్డులను సమర్పిస్తే ప్రభుత్వం తగిన పరిహారం ఇవ్వనుందని ఉద్యాన వనాలశాఖ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ శివారెడ్డి తెలిపారు.



బాలచంద్ర థియేటర్ సమీపాన రోడ్డుపై వర్షపునీరు



దెబ్బతిన్న తమలపాకుల తోట

ఘనంగా దేవెగౌడ పుట్టినరోజు వేడుకలు

శిడ్లఘట్ట, మే 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దేవెగౌడ పుట్టినరోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అర్థవంతంగా నిర్వహించారు. జేడీఎస్ కార్యకర్తలు అంధ విద్యార్థులతో కలసి కేక్ కట్ చేసిన అనంతరం వారికి యూనిఫాం అందచేశారు. తర్వాత ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు అందచేశారు. నగరసభ అధ్యక్షుడు ఎంవీ వెంకటస్వామి సహా జేడీఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. నగరసభ ఉపాధ్యక్షురాలు రూపా నవీన్, నగరసభ సభ్యులు రమేశ్, నారాయణస్వామి, కృష్ణమూర్తి, ఎస్ రాఘవేంద్ర, మంజునాథ్, నిజాంబాలు తదితరులు పాల్గొన్నారు.



అంధ విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

జ్ఞానయజ్ఞంపై హర్షం

ముళబాగిలు, మే 18 (ఆంధ్రజ్యోతి): శ్రీపాదరాజ మఠం తనదైన విశిష్టతతో కొనసాగుతూ సమాజసేవలో కొనసాగుతోందని ప్రస్తుతం జ్ఞాన యజ్ఞ కార్యక్రమం చేపట్టడంపై పలిమారుమఠం పీఠాధిపతి విద్యాధీశతీర్థ స్వామీజీ అభిప్రాయపడ్డారు. పట్టణ శివారులోని నరసింహతీర్థ పాదరాజ మఠంలో ఏర్పాటైన జ్ఞానయజ్ఞ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పాదరాజ తమ కీర్తనల ద్వారా సమాజానికి ఉత్తమ సందేశం ఇచ్చారన్నారు. ఆయన ఆదర్శాలు, తత్వాలు, ఆలోచనలు ఉత్తమ సమాజానిమికి నాంది అయ్యాయన్నారు. ఇక్కడ జరుగుతున్న జ్ఞానయజ్ఞ కార్యక్రమానికి వివిధ మఠాధిపతులు విచ్చేయడం ద్వారా ఉత్తమ పరిణామం సాధ్యమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



విద్యాధీశతీర్థస్వామీజీకి ఆత్మీయ స్వాగతం

అపార్టుమెంట్ వాసుల సమస్యలపై సమావేశం

దొమ్మసంద్ర, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపురలో బెంగళూరు అర్బన్ విల్లా అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సంఘం తొలి వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు. సర్జాపుర గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు పై శ్రీరాములు, జిల్లా పంచాయతీ మాజీ సభ్యులు సుజాత నాగరాజు, డీసీఎం కార్యాలయ న్యాయవాది రఫీక్ అహ్మద్, అసోసియేషన్ సంస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మహేంద్రకృష్ణ పాల్గొన్నారు. ఇదే సందర్భంగా ప్రపంచ తల్లుల దినోత్సవాన్ని ఆచరించారు. మహిళలకు, పిల్లలకు వివిధ క్రీడాపోటీలు నిర్వహించారు. విల్లా, అపార్ట్‌మెంట్స్ నివాసుల సమస్యలను ఆలకించారు. వివిధ రంగాలలో సమాజసేవ అందిస్తున్న ఆరుగురు సాధకులకు పురస్కారాలతో సత్కరించారు. సంఘానికి నూతన పదాధికారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. బెంగళూరు దక్షిణ జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి దుర్గాదేవి, డాక్టర్ మహేంద్ర కృష్ణ దంపతులు కార్యక్రమానికి నేతృత్వం వహించారు. కార్యక్రమంలో ఉమేశ్‌దుబె, ఎస్ఎం రాయ్, కమలేశ్‌గుప్త, సంతోష్‌బాబు, అమిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

శేషాద్రిపురం.. గతుకులమయం

బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున ఉండే శేషాద్రిపురంలోని ప్రధాన రోడ్లు గతుకులమయంగా మారాయి. శేషాద్రిపురంలోని పలు రోడ్లపై ప్రయాణించాలంటే భయపడే పరిస్థితి ఏర్పడింది. కొన్ని నెలలకాలంగా మరమ్మత్తులు చేయకుండా నిర్లక్ష్యం చేయడం, ప్రస్తుతం వర్షాకాలంతో మరింత అధ్వానంగా మారాయి. మల్లేశ్వరం, ప్యాలెస్‌రోడ్లకు అనుబంధంగా మెజస్టిక్ బస్టాండ్‌కు సమీపంలో ఉండే శేషాద్రిపురం రోడ్డులో నిత్యంవేలాది వాహనాలు సంచరిస్తాయి. అటువంటి రద్దీ రహదారులు గుంతలు ఏర్పడ్డంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రేటర్ బెంగళూరు అధికారులు వెంటనే స్పందించాల్సి ఉంది.



శేషాద్రిపుర ప్రాంతంలో గుంతలుపడిన రహదారి

కారు, ద్విచక్రవాహనం ఢీ - ఒకరి మృతి

బాగేపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని టోల్‌గేట్ సమీపాన ఆదివారం ఉదయం చోటు చేసుకున్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. 17వ వార్డుకు చెందిన కంచికోట శివశంకరప్ప (66) తన ఎక్సెల్ ద్విచక్రవానంపై వెళ్తుండగా బెంగళూరు నుంచి వచ్చిన కారు ఢీ కొంది. తలకు తీవ్రగాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాలూకా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



శివశంకరప్ప (ఫైల్)

అభివృద్ధి ఒక్క జిల్లాకే పరిమితం చేయడం తగదు

● సాహితీవేత్త చంద్రశేఖర్ గోరేబాళ

రాయచూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : కల్యాణ-కర్ణాటక అభివృద్ధి ఒక్క జిల్లా పరిమితం కావడం గర్హనీయమని కవి, సాహితీవేత్త చంద్రశేఖర్ గోరేబాళ అన్నారు. కల్యాణ-కర్ణాటకలో రాయచూరు, యాదగిరి, బీదర్, వంటి వెనక బడిన జిల్లాలు కూడా ఉన్నాయన్న స్పృహను పాలకులు మరిచిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింధనూరులో నిర్వహిస్తున్న అభ్యుదయ సాహితీవేత్తలు, కవుల సమావేశంలో ఆదివారం పాల్గొని ఆయన ప్రసంగించారు. పార్టీలు ప్రభుత్వాలు మారినా కల్యాణ-కర్ణాటక ప్రాంతంలో అభివృద్ధికి మాత్రం దూరంగానే ఉండాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రాంతానికి పేరు మాత్రమే కల్యాణ అని పెట్టింది తప్పా అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందన్నారు. రాయచూరు జిల్లాలో పెద్ద ఎత్తున పత్తి పంట ఉన్నా టెక్స్‌టైల్స్ పార్కు లేకపోవడం ఇక్కడి రైతులకు శాపంగా మారిందన్నారు. దీంతో పాటు రాయచూరు జిల్లాలో అనేక పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉన్నా ప్రభుత్వం మంజూరు చేసినవన్ని కలబుర్గి జిల్లావైపు తరలిపోతుండడం రాజకీయపెత్తనానికి సాక్షిగా మిగిలిందన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్ గోరేబాళ

ప్రమోషన్లలో వర్గీకరణ అమలు చేయాలి

అనంతపురం సెటల్, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల ప్రమోషన్లలలో ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలని ఎంఆఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోన ఆ సంఘం కార్యాలయంలో ఆదివారంనిర్వహించిన సమావేశంలో శంకర్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయ, సహకారాలతో వర్గీకరణ సాధ్యమైందన్నారు. విభాగాల వారీగా అమలు చేయ డంలో జాప్యం నెలకొందని, రాష్ట్రస్థాయి అధికారులు స్పందించి ఉత్త ర్వులు జారీచేయాల్సిన అవసరముందన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు ఈ-మెయిల్‌ద్వారా లేఖ పం పామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, నాగేంద్ర, శ్రీనివాసులు, నాగభూషణ, నారాయణస్వామి, హరికృష్ణ పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్త : డాక్టర్ ప్రసూన

అనంతపురం కల్చరల్, మే 18(ఆంధ్రజ్యోతి) : రానున్నది వర్షాకాలం కాబట్టి మూర్ఛ వ్యాధి రోగులు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని జేవీవీ నగర గౌరవాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన పేర్కొన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో ఆదివారం గిల్డ్ ఆఫ్ సరీస్వస్ హైస్కూల్ వద్ద నిర్వహించిన మూర్ఛ వ్యాధి వైద్య శిబిరానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మూర్ఛ వ్యాధి బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. అనంతరం దాదాపు 110 మంది మూర్ఛ వ్యాధి బాధితులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ హరికిషోర్, జేవీవీ నగరాధ్యక్షుడు రామిరెడ్డి, నాయకులు టీచర్ నాగరత్నమ్మ పాల్గొన్నారు.

మంత్రితో బైక్‌ట్యాక్సీ అసోసియేషన్ ప్రతినిధుల భేటీ

బెంగళూరు, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బైక్ ట్యాక్సీలకు నిబంధనలు పెట్టాలి గానీ పూర్తిగా వేటు వేయరాదని బైక్‌ట్యాక్సీ అసోసియేషన్ తరఫున సుమారు వందమంది రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డిని కలిశారు. శనివారం కోరమంగలలోని మంత్రి కార్యాలయం వద్ద బైక్‌ట్యాక్సీ ప్రతి నిధులు సమస్యలు వివరించారు. రాష్ట్రంలో 6లక్షలమంది కన్నడిగులు జీవనాధారంగా బైక్ ట్యాక్సీలు నడుపుతున్నారన్నారు. 75శాతం మంది ప్రాథమికంగా ఇదే ఆధారంగా ఉన్నారన్నారు. సుస్థిరమైన నియంత్రణ, డ్రైవర్ల న్యాయపరమైన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బెంగళూరులో 20లక్షలమందికిపైగా ప్రయాణీకులు సేవలు వినియోగించుకుంటున్నారన్నారు. 50లక్షలమందికిపైగా రైడ్‌లను మొబిలిటీ అగ్రిగేటర్ ప్లాట్‌ఫాం ద్వారా వినియోగించుకుంటున్నారన్నారు. బైక్ ట్యాక్సీలో స్త్రీ, పురుషులు ఉన్నారని, ఆరేళ్లుగా ఇదే జీవనంగా కొనసాగుతున్నారన్నారు. బైక్ ట్యాక్సీల నిర్వహణకు ప్రభుత్వం పర్మిట్ ఫీజులాంటివి విధిస్తే చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కానీ నిబంధనల పేరిట వేధించరాదన్నారు.

ఘనంగా వరసిద్ధి వినాయక రథోత్సవం



పురవీధుల్లో రథోత్సవం

బాగేపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 9వ వార్డులో కొలువైన వరసిద్ధి వినాయక ఆలయ 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. వినాయకుడిని వెండిరథంపై కొలువుదీర్చారు. ఆలయ సేవా ట్రస్టు సభ్యుల నేతృత్వంలో పురవీధులలో రథోత్సవం కొనసాగింది. బాణాసంచా కాలుస్తూ సంబరం చేసుకున్నారు. వివిధ జానపద, సాంస్కృతిక కళాబృందాలు కీలుగుర్రాలు, డొళ్ళుకుణిత, చండివాద్యం, కోలాటం, గారడీబొమ్మలు, నాసిక్ డోలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు కొనసాగింది. ఆయల కమిటీ సభ్యులు ఏజీ సుధాకర్, అప్పయ్యబాబు, వెంకటేష్, గోపాలప్ప, రమేశ్, ఆది నారాయణప్ప, శ్రీనివాస మంజునాథ, పీఎస్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠాపన



విశేషపూజల్లో మాజీ మంత్రి అరవింద లింబావళి

మహదేవపుర, మే 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పట్టందూరు అగ్రహారలో గ్రామపండుగ, రామాంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆదివారం నిర్వహించిన విశేషపూజల్లో మాజీ మంత్రి అరవింద లింబావళి పాల్గొన్నారు. పట్టందూరు గ్రామపండుగలో గ్రామదేవతలు రేణుకా యల్లమ్మదేవి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రూరల్ హోబళి బీజేపీ అధ్యక్షుడు పిళ్ళప్ప, ప్రముఖులు ఎల్ రాజేశ్, కృష్ణప్ప, దయానందసాగర్, మంజునాథ, రాము, పవన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో
తల్లి, కుమారుడి మృతి



ప్రమాద స్థలంలో మృతదేహం

విజయపుర, మే 18 (ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణం బైపాస్ రోడ్డులోని స్టాన్‌సిల్క్స్ ఫ్యాక్టరీ సమీపాన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తల్లి, కుమారుడు మృతి చెందారు. విజయపుర నివాసులు శశికళ (45), కుమారుడు మనోజ్ (23)లు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. శనివారం మధ్యాహ్నం వర్షం కురుస్తున్న వేళ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనగా తల్లి ఒకవైపు, కుమారుడు మరోవైపు కిందపడ్డారు. తల్లికాళ్లు విరిగిపోయాయి. తల్లి, కుమారుడు ఘటనా స్థలంలోనే మృతి చెందారని విజయపుర పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సముదాయ ఆరోగ్యకేంద్రానికి తరలించారు. విజయపుర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.